ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5★★
మంగళవారం 2 ఏప్రిల్ 2024





బ్రహ్మోత్సవాల్లో ఆదాయం

ధర్మపురి, ఏప్రిల్ 1: బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయానికి 12 వ రోజు రూ 2,03,873 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. వీటిలో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ 81,258 లభించగా, ప్రసాదాలు విక్రయం ద్వారా రూ 90,970 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ 31,645 విరాళాలు సమర్పించినట్లు ఆయన వివరించారు.

ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకంజ

- జగిత్యాలలో 52.86 శాతమే
- ఆదాయ వనరులపై దృష్టి సారించకపోవడంతోనే..
- ప్రజల్లో అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం
- ఉన్నతాధికారులు దృష్టి సారిస్తేనే మేలు





జగిత్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్నుల వసూళ్లలో జగిత్యాల బల్దియా అధికారు లు వెనుకంజలో ఉన్నారు. ప్రతీ సంవత్సరం ఆస్తి పన్ను వసూలు చేయడం మున్సిపల్ అధికారులకు సాధారణమే అయినప్పటికీ నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రజల్లో అవగాహన కల్పించడం, ఫైన్‌లు వేస్తామని చెప్పడం వంటివి చేస్తూ పన్ను వసూళ్ల చేయాల్సి ఉన్నప్పటికీ ఆ దిశగా పనులు జరగడం లేదు. మున్సిపల్‌లోని రెవెన్యూ విభాగంలో సరి పోయే సిబ్బంది లేకపోతే ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులకు సైతం తాత్కాలిక బాధ్యతలు అప్పగించి పన్ను వసూళ్ల చేయించాల్సి ఉంటుంది. జగిత్యాల మున్సిపల్‌లో రెవెన్యూ విభాగంలో ఎలాంటి పోస్టులు ఖాళీగా లేవు. అయినప్పటికీ పన్నుల వసూళ్ల లక్ష్యం నెరవేరడం లేదు.

కింది స్థాయి అధికారులు, ఉద్యోగుల పనితీరుపై మున్సిపల్ ఉన్నతాధికారులు సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడం, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి దిశా నిర్దేశం చేయడంలో విఫలం కావడం ఫలితంగా 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసే సరికి జగిత్యాల మున్సిపల్‌లో కేవలం 52.86 శాతం మాత్రమే పన్నులు వసూళ్ల అయ్యాయి. దీనివల్ల మునుముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధులు మున్సిపల్‌కు రాకుండా గండి ప్రమాదం ఉంది. సొంత ప్రయోజనాలపై దృష్టి సారించి అదనపు ఆదాయాన్ని ఇచ్చే పనులపై మక్కువ ప్రదర్శిస్తున్న మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులు ఆస్తి పన్ను వసూళ్లను పట్టించుకోవడం లేదన్న విమర్శలు చోటు చేసు కుంటున్నాయి.

జగిత్యాల మున్సిపల్‌లో పన్ను వసూళ్ల తీరిది...

జగిత్యాల మున్సిపల్‌లో 48 వార్డులున్నాయి. ఆయా వార్డుల్లో ఆస్తి పన్ను వసూళ్ల చేయడానికి అధికారులు తొమ్మిది బృందాలను ఏర్పాటు చేశారు. జగిత్యాల పట్టణంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ. 13.71 కోట్ల పన్ను వసూళ్ల చేయాలన్న లక్ష్యం ఉంది. ఇందులో గత నెల 31వ తేదీ వరకు రూ. 7.25 కోట్ల పన్ను వసూళ్ల జరిగింది. పట్టణంలో ఆ ర్థిక సంవత్సరం ముగిసే వరకు కేవలం 52.86 శాతం మాత్రమే పన్ను వసూళ్ల జరిగాయి. ఇందులో సుమారు 20 శాతం పన్ను గత యేడాది ఏ ప్రిల్‌లో ప్రభుత్వం కల్పించిన అయిదు శాతం వడ్డీ రాయితీ సమయంలోనే ఆదాయం సమ కూరిందన్న అభిప్రాయాలున్నాయి.

జగిత్యాలలో ప్రభుత్వ సంస్థలు సైతం సక్రమంగా పన్ను కట్టడం లేదు. జగిత్యాలలో ప్రభుత్వ సంస్థలు రూ. 82.01 లక్షల పన్ను చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 7.95 లక్షలు మాత్రమే వసూళ్ల అయ్యాయి. గత యేడాదితో పోలిస్తే పన్ను వసూళ్ల చేయడానికి రెవెన్యూ విభాగంలో అవసర మైన సిబ్బంది మున్సిపల్‌లో పెరిగినప్పటికీ పన్ను వసూలు కాకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జగిత్యాల మున్సిపల్‌లో రెవెన్యూ విభాగంలో మంజూరు అయిన పోస్టుల ప్రకారం ఒక రెవెన్యూ అధికారి, ఇద్దరు బిల్ కలెక్టర్లు, ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. ఎలాంటి పోస్టులు ఖాళీగా లేవు. దీనికి తోడు ఇటీవల ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేయడం వల్ల ఆరుగురు ఉద్యోగులను జగిత్యాల మున్సిపల్‌కు కేటాయించారు. వీరిని సైతం ప్రధానంగా రెవెన్యూ విభాగంలోనే వినియో గించుకుంటున్నారు.

అయినప్పటికీ పన్ను వసూళ్ల సక్రమంగా జరగకపోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పన్ను అసిస్‌మెంట్లు, ఇతర విధులు నిర్వర్తించడంలో కనిపిస్తున్న మక్కువ పన్ను వసూళ్ల చేయడంలో కనిపించడంలేదన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అదే విధంగా గత నెల 31వ తేదీ వరకు జిల్లాలోని కోరుట్ల మున్సిపల్‌లో 81.20 శాతం, మెట్‌పల్లిలో 66.28 శాతం, రాయికల్ 82.03 శాతం, ధర్మపురి మున్సిపల్ 82.03 శాతం ఆస్తి పన్ను వసూళ్ల అయింది.

అదనపు పనుల కేటాయింపు వల్లే అంటున్న ఉద్యోగులు...

మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగం అధికారులు, ఉద్యోగులకు ప్రభుత్వం అదనపు పనులు కేటాయించడం వల్ల ఆస్తి పన్ను వసూళ్లపై సక్ర మంగా దృష్టి సారించలేకపోతున్నామని సంబందిత ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన విధులు, ఎన్ని కల విధులు, పలు సందర్భాల్లో జరుపుతున్న సర్వేలు, డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల ఎంపిక, ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల సర్వేలు తది తర పనులు అప్పగించడం వల్ల ఆస్తి పన్ను వసూళ్లపై ప్రభావం పడు తుందంటున్నారు. దీంతో పాటు నిబంధనల ప్రకారం నిర్ణీత నిష్పత్తిలో బిల్ కలెక్టర్ల కేటాయింపు జరగడం లేదని, పోస్టులు మంజూరు చేయ డం లేదని ఫలితంగా ప్రస్తుతం ఉన్న ఉద్యోగులపై అదనపు భారం పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దీనికి తోడు మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్ బాధ్యతలను సైతం బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లకు అప్పగించడం వల్ల పలు విధులను నిర్వర్తిం చాల్సి వస్తోందని వాపోతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులపై పడనున్న ప్రభావం...

జగిత్యాల మున్సిపల్‌లో వంద శాతం పన్ను వసూలు కాక పోవడం వల్ల మున్ముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే నిధులు, ఆర్థిక సంఘం నిధులు రాకుండా ఉండే ప్రమాదం పొంచి ఉంది. లక్ష్యం మేరకు పన్ను వసూళ్ల చేసిన మున్సిపాలిటీలకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్థిక సంఘం నిధులు కేటాయించే అవకా శాలున్నాయి. ఆర్థిక సంఘం నిధులు రాకుంటే మున్సిపల్‌లో అభి వృద్ధికుంటుపడే ప్రమాదం ఉంది. దీనికి తోడు మున్సిపల్‌లో అవసర మైన వ్యయాలకు ప్రధానంగా జనరల్ ఫండ్ ఆధారం అవుతోంది. పన్ను వసూళ్ల సక్రమంగా లేని కారణంగా జనరల్ ఫండ్ సమకూరే అవకాశాలు లేకుండా పోతున్నాయి. దీని వల్ల మున్సిపల్‌లో పని చేస్తున్న కార్మికులకు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు, ఇతర అత్యవసర పనులకు నిధులు కేటాయించే అవకాశాలు సన్నగిల్లుతున్నట్లవుతోంది.

పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాము

అనిల్ బాబు, మున్సిపల్ కమిషనర్, జగిత్యాల



జగిత్యాల మున్సిపల్‌లో లక్ష్యం మేరకు పన్ను వసూళ్ల చేయడంపై దృష్టి సారించాము. మున్సిపల్ ఉద్యోగులకు అదనపు బాధ్యతలు అప్పగించడం వల్లనే పన్ను వసూళ్ల సక్రమంగా జరగడం లేదు. దీనికి తోడు అవసరమైన నిష్పత్తి ప్రకారం బిల్ కలెక్టర్ల కేటాయింపు లేదు. ప్రస్తుతం ఉన్న అధికారులు, ఉద్యోగులతోనే పన్ను వసూళ్ల చేయిస్తున్నాము. సాధ్యమైనంత మేరకు పన్ను వసూళ్ల జరిగేలా కృషి చేస్తున్నాము.

కేంద్ర బలగాల కవాతు



మల్యాలలో కవాతు నిర్వహిస్తున్న జవాన్లు, పోలీసులు

మల్యాల, ఏప్రిల్ 1: మల్యాల మండల కేంద్రంలో సోమవారం జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ కోసం నిర్వహించిన ఈ కవాతును అడిషనల్ ఎస్పీ భీమ్‌రావు, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ జెండా ఊపి ప్రారంభించారు. కవాతులో యువకులు, విద్యార్థులు పాల్గొని కేంద్ర బలగాలకు స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. జగిత్యాల డిఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి, ఆర్‌ఐ వేణు, ఎస్సైలు అబ్దుల్ రహీం, కుమారస్వామి పోలీసులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు అండగా కాంగ్రెస్ పార్టీ

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి



గౌడన్నలతో కలిసి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 : గీత కార్మికులకు ఎల్లప్పుడు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గొల్లపెల్లి రోడ్‌లో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గీత కార్మిక సహకార సంఘం సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. గీత కార్మిక సంఘం ఫెడరేషన్‌కు నిధులు సమకూర్చేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకవెళుతానన్నారు. సంఘం భవన నిర్మాణ పనులు పూర్తయ్యే విధంగా తన వంతుగా నిధుల కేటాయింపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరికలు..

రాయికల్ మండలం వీరాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు రామస్వామి గౌడ్, ఉప్పు మడుగు పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ స్వామి రెడ్డి, డైరెక్టర్లు మురళి, శంకర్, రాజ మల్లయ్య, నరేష్, నర్సయ్య, రాజు, అక్షయ్ తదితరులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇందిరా భవన్‌లో జీవన్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకుని మాట్లాడారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. మండల అధ్యక్షుడు రవీందర్‌రావు ఉన్నారు.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

జగిత్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా అన్నారు. సోమవారం టీఎన్‌జీఓల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీఎన్‌జీవో నాయకులు, కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

హన్మంతరావు మృతి తీరని లోటు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ, న్యాయవాదులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1 :సీనియర్ న్యాయవాది హన్మంతరావు మృతి బార్ అసోసియేషన్‌కు తీరని లోటని ఎమ్మెల్సీ, న్యాయవాది జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన సీనియర్ న్యాయవాది, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తండ్రి హన్మంతరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించి ఆయన చిత్ర పటానికి ఎమ్మెల్సీ పాటు న్యాయవాదులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి ఉన్నారు.

సంజయ్ కుమార్‌ను రాజ్యసభ సభ్యుడు దామోదర్ రావు పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ప్రజావాణిలో 24 దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహిం చిన ప్రజావాణిలో 24 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తుల వద్ద నుంచి కలెక్టరేట్ కార్యాలయ ఏఓ పుప్పాల హన్మంత్‌రావు దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

రాయికల్, ఏప్రిల్ 1: మండలంలోని కొత్తపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు. ఈ నెల 6 వరకు ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2న యాగశాల ప్రవేశం, ప్రత్యేక హోమాలు, 3న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, భక్తులకు అన్నదానం, 4, 5, 6న ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు.

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు

ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్

మెట్‌పల్లి, ఏప్రిల్, 1 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవని ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్ హెచ్చరించారు. సోమవారం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నమోదు అయిన కేసుల వివరాలు, పరిష్కరిస్తున్న తీరును అడిగి తెలుసుకొని రికార్డులతో పాటు స్టేషన్ పరిసరాల ను పరిశీలించారు. స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలు, నేరస్తులు, రౌడీ షీటర్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేసన్‌కు వచ్చిన బాధితల ఫిర్యాదులు, ప్రజా సమస్యల పైన వెంటనే స్పందిస్తూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా బరోసా కల్పించాలన్నారు. జరగబోయే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణలో జరిగేలా ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్‌లు నిర్వహించి ఓటర్లకు భద్రత భావాన్ని కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది సాంకేతికంగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే స్పందించి సంఘటన స్థలంకు చేరుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రజలకు సైబర్ నేరాలు, మోసాల గురించి అవగాహన కల్పించి చైతన్య పరచాలని సూచించారు. ఎన్నికల సమయంలో గొడవలు, అల్లర్లు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే నేరస్థులపై, రౌడీషీటర్లపై నిఘా ఏర్పాటు చేయాలని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఉమామహేశ్వరరావు, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై చిరంజీవి, సిబ్బంది, ఉన్నారు.



మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో వివరాలను తెలుసుకుంటున్న ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్

వేతనాలు రాక డ్రైవర్ల ఇక్కట్లు

ధర్మపురి, ఏప్రిల్ 1: ధర్మపురి మున్సిపల్ పరిధిలో పని చేస్తున్న ఎనిమిది మంది అవుట్ సోర్సింగ్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రెండు రోజుల నుంచి డ్రైవర్లు పని మాని వేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో చెత్త తొలగించి, డంపింగ్ యార్డుకు తీసుక వెళ్లే ట్రాక్టర్లు, ట్రాలీల కోసం ఎనిమిది మంది అవుట్ సోర్సింగ్ డ్రైవర్లను మూడు ఏళ్ల క్రితం నియమించారు. ఇందులో కొందరు డ్రైవర్లకు 13 నెలలుగా, మరి కొందరు డ్రైవర్లకు 8, 9 నెలలు నుండి వేతనాలు రావడం లేదు. దీంతో డ్రైవర్లు సంబంధిత అధికారులను వేతనాలు గురించి అడగడం వల్ల సమాధానం ఇవ్వడం లేదు. డ్రైవర్లు కనీసం ఆరు నెలల వేతనాలు ఇవ్వాలని కోరగా వేతనాలు ఎప్పుడు వస్తే అప్పుడు తీసుకోవాలని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కుష్టువ్యాధిని ప్రారంభ దశలో గుర్తించాలి

జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

కొడిమ్యాల, ఏప్రిల్ 1 : కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించాలని జిల్లా ఉప వైద్యాధికారి ఎన్. శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి అనుమానితులకు జిల్లా ఉప వైద్యాధికారి పరీక్షలను నిర్వహించారు. అవసరం ఉన్న వారికి మందులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ముందుగానే గుర్తించకుంటే బాధితులకు అంగవైకల్యం వచ్చే ప్రమాదం ఉందన్నారు. కుష్టు వ్యాధికి ప్రభుత్వం ప్రతి ప్రైమరీ సెంటర్‌లలో ఉచితంగా చికిత్సను అందిస్తుందన్నారు. అనుమానితులు ఎవరైన ఉంటే ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకరావాలన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 130 మందికి పరీక్షలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, డీపీఎంవోఈ దేవ్‌సింగ్, హెల్త్ సూపర్‌వైజర్లు వెంకటనర్సమ్మ, అలివేలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

నెగ్గుతుందా..వీగుతుందా..!

- నేడు మల్యాల ఎంపీపీపై అవిశ్వాసం
- అవిశ్వాస శిబిరం నుంచి ఒకరు జంప్

మల్యాల, ఏప్రిల్ 1: మల్యాల ఎంపీపీ మిట్టపల్లి విమలపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఎంపీటీసీలు ఇచ్చిన నోటీస్‌ల నేపథ్యంలో రెండవ సారి మంగళవారం ఆర్డీవో సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు అధికారులు చేపట్టారు. మల్యాల మండల ఎంపీటీసీలు ఆర్డీవోకు ఎంపీపీపై అవిశ్వాస నోటీస్ ఇవ్వగా ఎంపీపీ విమల(బీఆర్ఎస్) ఆర్డీవోలకు అవ్విశాస సమావేశాలు ఏర్పాటు చేసే అధికారం లేదని హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకురావడంతో జనవరి 10న జరుగాల్సిన అవిశ్వాస ప్రత్యేక సమావేశం సభ్యులు హాజరు అయినప్పటికీ వాయిదా పడింది. దీంతో అవిశ్వాస ప్రక్రియ నిలిచిపోగ ఇటీవల హైకోర్టు ఆర్డీవోలు అవిశ్వాస సమావేశాలు నిర్వహించవచ్చుననే ఆదేశాల మేరకు ఏప్రిల్ 2న మళ్లీ సమావేశం ఏర్పాటు చేశారు. ఇక్కడి ఎంపీపీ విమలపై డిశంబరు 20న బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీకి చెందిన సభ్యులు పోతాని రవి(మద్దుట్ల), క్యాతం పద్మ (రాంపూర్), మారంపల్లి నర్సవ్వ(రాజారం), కట్కూరి నవత(లంబాడిపల్లి) కాంగ్రెస్‌కు చెందిన దొంగ అనిత (తాటిపల్లి), మరాఠి సంజన(తక్కళ్లపల్లి) ఆగంతపు రవళి (మల్యాల-1), సఫియాబేగం(రామన్నపేట) బీజేపీకి చెందిన ముదుగంటి వనిత (మ్యా డంపల్లి), కొల్లూరి గంగాధర్(పోతారం) ఎంపీటీసీలు జగిత్యాల ఆర్డీవోకు అవిశ్వాసం నోటీస్ అందజేశారు. లంబాడిపల్లి, బల్వంతాపూర్ ఎంపీటీసీలు నవత, సంగని రవి ప్రస్తుతం ఎంపీపీ వర్గంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమం లో రెండు శిబిరాలకు చెందిన కొందరు ఎంపీటీసీలు క్యాంపులో ఉన్నారు.



మల్యాల మండల పరిషత్ కార్యాలయం

● 10మంది ఉంటేనే అవిశ్వాసం

నేడు నిర్వహించే అవిశ్వాస ప్రక్రియకు పది మంది సభ్యులు హాజరై ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తే అది నెగ్గుతుండగా అవిశ్వాసం నోటీస్ ఇచ్చిన శిబిరం లోనుంచి ఒకరు ఎంపీపీ శిబిరంలోకి వెళ్లినట్లు తెలుస్తుండగా ప్రస్తుతం నోటీస్ ఇచ్చిన శిబిరంతో 9మంది మాత్రమే ఉన్నట్లు అయింది. దీంతో మండలంలో రాజకీయాలు వేడెక్కాయి. అవిశ్వాసం నెగ్గుతుందా.. వీగుతుందా అనేది నేడు తేలనుంది. ఇందులో భాగంగా దుబాయి వెళ్లిన ఓ ఎంపీటీసీ సభ్యున్ని అవిశ్వాస సమావేశంలో పాల్గొనడానికి గాను రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. కాగ ఎంపీపీ శిబిరంలో ఎంపీపీతో పాటు ముత్యంపేట, లంబాడిపల్లి, బల్వంతాపూర్ ఎంపీటీసీలు ఉన్నారు. కాగ రెండు వర్గాలు.. సభ్యులను తమ వైపు తిప్పుకోవడానికి సంప్రదింపులు చేస్తూనే ఉన్నారు.

సైన్స్ ల్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో జగన్ మోహన్ రెడ్డి

జగిత్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్న సైన్స్ ల్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈవో జగన్ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మానసా ఎక్సలెన్స్ పాఠశాలలో అధునాతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను డీఈవో ప్రారంభించి మాట్లాడారు. పాఠశాలలు తప్పనిసరిగా సైన్స్‌ల్యాబ్‌లను కలిగియుండాలన్నారు. విద్యార్థులు మౌఖికంగా నేర్చుకున్న దానికంటే ప్రయోగాత్మకంగా చేస్తూ నేర్చుకున్న జ్ఞానం శాశ్వతంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేసినప్పుడే పరిపూర్ణ జ్ఞానం పొందగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రావు, డైరెక్టర్లు హరి చరణ్‌రావు, మౌనిక రావు, ప్రిన్సిపాల్ రజితారావు, ఉపాధ్యాయిని, పాల్గొన్నారు.

ఉద్యమకారుల జిల్లా ఫోరం కోఆర్డినేటర్‌గా శ్రీనివాస్ గౌడ్

వెల్గటూర్, ఏప్రిల్ 1: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కో ఆర్డినేటర్‌గా మండలం లోని తాళ్లకొత్తపేట గ్రామాని కి చెందిన గాజుల శ్రీనివాస్ గౌడ్ నియమి తులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డి, కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఛైర్మన్ కనకం కుమార స్వామి ఆయనకు సోమవారం నియామక పత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం ప్రతిధ్వనించేలా పని చేయాలని సూచించారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. అయిల ప్రసన్న, పద్మ, శంకర్, అంకుష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినికి గాయాలు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థిని

తిమ్మాపూర్, ఏప్రిల్1: మండలంలోని ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొని ఓ విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లాకు చెందిన ఉప్పాల శ్రీహర్ష అనే విద్యార్థిని స్థానికంగా ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ సమీపంలోని ఓ గర్ల్స్ హాస్టల్‌లో ఉంటోంది.

సోమవారం రాత్రి హాస్టల్ నుంచి బయటికి వచ్చి రాజీవ్ రహదారిపై రోడ్డు దాటుతుండగా కరీంనగర్ నుంచి హైదారాబాద్ వైపునకు వెళ్తున్న ఓ యువకుడు బైక్‌ను అతివేగంగా నడుపుతూ ఆ విద్యార్థిని ఢీకొట్టాడు. ఈ సంఘటనలో శ్రీహర్షకు తీవ్రగా యాలు కాగా స్థానికులు, ఎల్‌ఎండి పోలీసులు 108 వాహనంలో కరీంన గర్‌లోని ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,450 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 41మంది రైతులు 466క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7,450, కనిష్ఠ ధర రూ.7వేలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆలయాల్లో దొంగతనం

ఇబ్రహీంపట్నం, ఎప్రిల్ 1: మండలంలోని వర్షకొండ గ్రామంలో పలు దేవాలయల్లో అర్ధరాత్రి దొంగతనం జరిగినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, బ్రహ్మం గారి ఆలయం, పెద్దమ్మ, పంచముఖ, హన్‌మాన్ ఆలయలలో తాళాలు పగులగొట్టి దొంగతనం చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాదాపుగా 3.5 గ్రాముల బంగారు అభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్య దర్శి రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల బైండోవర్

శంకరపట్నం, ఏప్రిల్ 1: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీసులు సోమవారం బెల్ట్ షాపు నిర్వాహకులను తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని గద్దపాక, కాచాపూర్, రాజాపూర్, కన్నాపూర్, ధర్మారం గ్రామాలకు చెందిన 16మందిని తహసీల్దార్ కార్యాలయంలో హాజరు పరిచినట్లు తెలిపారు.

'నవోదయ' ప్రవేశ పరీక్ష ఫలితాల విడుదల

చొప్పదండి,ఏప్రిల్1: నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశపరీక్ష ఫలితాలు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. గత జనవరి 20న ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా మెరిట్, కేటగిరీ వారీగా ఎంపికైన విద్యార్థుల జాబితాను విడుదల చేశారు. ఎంపికైన విద్యార్థులు ఈ నెల 5న ఆధార్ కార్డు, హాల్‌టికెట్, ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో విద్యాలయంలో హాజరు కావాలని ఆమె తెలిపారు.

రాజరాజేశ్వర క్షేత్రంలో భక్తుల రద్దీ



భక్తులతో సందడిగా ఉన్న ఆలయ ప్రాంగణం



కోడె మొక్కు చెల్లించుకుంటున్న మంత్రి కొండా సురేఖ

వేములవాడ, ఏప్రిల్ 1: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం సోమవారం భక్తజనంతో కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి కృష్ణప్రసాద్ నేతృత్వంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

కల్యాణం టికెట్ల కోసం భక్తుల ఇబ్బందులు

రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి నిత్య కల్యాణం టికెట్ల కోసం భక్తులు ఇబ్బందులు పడ్డారు. శివ కల్యాణం ఉత్సవాల సందర్భంగా గత ఐదు రోజులుగా స్వామివారి నిత్య కల్యాణం టికెట్లు నిలిపి వేయగా, కల్యాణోత్సవాలు ముగిసిన నేపథ్యంలో సోమవారం స్వామివారి నిత్య కల్యాణం యథావిధిగా ప్రారంభించారు. కల్యాణంలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ముందు భాగంలోని కళాభవన్ మొదటి అంతస్తులో స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తారు. ఈ ప్రాంగణంలో పరిమిత సంఖ్యలోనే భక్తులు స్వామివారి కల్యాణంలో పాల్గొనడానికి వీలవుతుంది. గరిష్ఠంగా 180 టికెట్ల వరకు మాత్రమే జారీ చేస్తారు. కల్యాణోత్సవం టికెట్లు విక్రయం ప్రారంభించిన కొద్దిసేపట్లోనే టికెట్లు దాదాపుగా అయిపోయాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అనేకమంది భక్తులు కల్యాణోత్సవం టికెట్ల కోసం ప్రయత్నాలు చేశారు. అయినప్పటికీ టికెట్ దొరకక పోవడంతో నిరాశకు గురయ్యారు. ఇదిలా ఉండగా సోమవారం స్వామివారి కోడె మొక్కు చెల్లింపు కోసం సైతం పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆలయ గుడి చెరువు పార్కింగ్ స్థలం నుంచి ప్రారంభమైన క్యూలైన్‌లో భక్తులు కిక్కిరిసిపోయారు. కోడె మొక్కు చెల్లింపు కోసం భక్తులు రెండు నుంచి మూడు గంటలకు పైగా వీక్షించాల్సి వచ్చింది.

రాజన్న సేవలో మంత్రి కొండా సురేఖ

వేములవాడ: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి సేవలో తరించారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి స్వామివారి ప్రసాదం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఆమె వెంట ఉన్నారు.

ఉపాధి పనుల్లో కూలీకి తీవ్రగాయాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 1: గంభీరావుపేట మండలం గోరంటాలలో సోమవారం ఉపాధి పనుల్లో కూలీకి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బండ సత్తవ్వ రోజు మాదిరిగానే ఉపాధి పనికి వెళ్లింది. పనులు చేస్తుండగా సత్తవ్వ చేతిపై పార బలంగా తగలడంతో ఎడమ చేతి నాలుగు వేళ్లు అక్కడే తెగిపడ్డాయి. తీవ్రంగా గాయపడటంతో ముందుగా సిరిసిల్ల అక్కడి నుంచి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలు

- రోడ్డుపై ధాన్యం కుప్పలతో ఘటన

వీర్నపల్లి, ఏప్రిల్ 1 : వీర్నపల్లి మండలం శాంతినగర్ గ్రామ శివారులో ప్రధాన రహదారిపై వరిధాన్యం కుప్ప ఎక్కడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి గంగాధర మండలానికి చెందిన భాస్కర్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గంగాధర నుంచి సిరికొండ వైపు వెళ్తున్న భాస్కర్ రోడ్డుపై పోసిన వరి ధాన్యం కుప్పలను ఎక్కించడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి తలకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

యువతి ఆత్మహత్య

పెగడపల్లి, ఏప్రిల్1: మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన పూసల వైష్ణవి (20) అనే యువతి క్రిమిసంహారక మందు తాగి ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిగ్రీ చదువుతున్న వైష్ణవి పరీక్షల్లో ఫెయిలయ్యానని బాధతో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. వైష్ణవి తండ్రి రాజేశం ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జాడి రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ఉగ్ర నారసింహుని ఏకాంతోత్సవం



ఉగ్ర నారసింహుని ఆలయంలో పూజలు



శేషప్ప కళావేదికపై చిన్నారుల నృత్య ప్రదర్శన

ధర్మపురి, ఏప్రిల్ 1: ధర్మపురి క్షేత్రంలో శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (ఉగ్ర)వారల ఏకాంతోత్సవం సోమవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు రాత్రి వేళలో అందంగా పూలతో అలంకరించిన స్వామివారలకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను సేవలపై ఉంచి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అర్ధరాత్రి స్వామివారల ఉత్సవ మూర్తులను వేదిక వద్దకు తీసుకవెళ్లారు. అనంతరం స్వామి వారలను పవళింపజేసి ఏకాంతోత్సవం నిర్వహించారు. దీంతో శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలు ముగిశాయి. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో అర్ధరాత్రి వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు దర్శనం చేసుకుని ఉత్సవాన్ని తిలకించారు. అంతకు ముందు శేషప్ప కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీ సాయి సన్నిధి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిన్నారులచే నృత్య ప్రదర్శనలు భక్తులను ఎంతో ఆకట్టుకున్నాయి. కల్వచర్ల సీహెచ్ విష్ణు బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించిన ఎన్టీపీసీ

2023-24లో 16,645 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి

జ్యోతినగర్, ఏప్రిల్ 1: రామగుండం ఎన్టీపీసీ 2023-24 ఆర్థిక సంవత్సర విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించింది. ఈ ఆర్థిక సంవత్సరం 16,600 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా(ఎంవోయూ) నిర్ణయించగా మార్చి 26న ప్రాజెక్టు టార్గెట్‌ను సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం ప్రాజెక్టులో కొన్ని సాంకేతిక, వార్షిక మరమ్మతులు తదితర అవాంతరాలు ఎదురైనప్పటికీ లక్ష్యాన్ని సాధించడం విశేషం. ప్రాజెక్టులోని 500 మెగావాట్ల 7వ యూనిట్ నిరంతరాయంగా 305 రోజులపాటు విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నది. ఇన్ని రోజులపాటు యూనిట్ నిరాటంకంగా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించడం రికార్డుగా అధికారులు తెలిపారు. అలాగే 100 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ కేంద్రం 2023-24 ఆర్థిక సంవత్సరంలో 196.17 మిలియన్ యూనిట్ల రికార్డు విద్యుత్ ఉత్పత్తి నమోదైంది.



రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు

- బీజేపీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 1: దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి, మేనిఫెస్టో కమిటీ సభ్యుడు ఎస్.కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని శుభమంగళ గార్డెన్స్‌లో జరిగిన బీజేపీ మేనిఫెస్టో కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ మేనిఫెస్టోలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. దేశానికి ఏది అవసరమో యువత గుర్తించి లిఖిత పూర్వకంగా అందించాలన్నారు. పదేళ్లుగా దేశంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలు, ఆశయాలకు అనుగుణంగా పనిచేసిందన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. మేనిఫెస్టోలో యువత భాగస్వామ్యం కోసం 17 పార్లమెంట్‌నియోజక వర్గాల్లో అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా సేకరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత సూచనలు తీసుకుని బీజేపీ ప్రజా మేనిఫెస్టో రూపొందిస్తుందన్నారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ ప్రభారి మీసాల చంద్రయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుగ్గిళ్లపు రమేష్, గంద్రనళిని, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దుర్శెటి సంపత్, మాజీ మేయర్ డి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.



యువత నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు

కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే సాగు నీటి ఎద్దడి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 1: రబీ పంటల సాగు కోసం నీటి విడుదలకు సరైన ప్రణాళికలు రూపొందించకపోవడంతో పాటు కేసీఆర్ అనాలోచిత నిర్ణయంతోనే సాగు నీటి ఎద్దడి ఏర్పడిందని దీనికి పూర్తిగా కేసీఆరే నైతిక బాధ్యత వహించాలని ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో సోమవారం జీవన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్న నాయకులు ఇతర పార్టీలోకి వెళ్లడానికి కేసీఆర్ నిర్ణయాలు, ఎన్నికల ఫలితాల పతనమే కారణమన్నారు. తప్పులను కప్పిపుచ్చుకకు నేందుకు, ప్రజల దృష్టిని మరల్చేందుకు కేసీఆర్ ఇప్పుడు జిల్లాల పర్యటన పేరుతో పంటల పరిశీలన చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భవిష్యత్‌లో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి పంటల బీమా పథకం అమలు చేసేలా చర్యలు చేపడుతున్నారన్నారు. గడిచిన ఐదేళ్ల లో పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయని కేసీఆర్ ఇపుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజులకే రుణ మాఫీ ఏమైందని అడుగడం హాస్యాస్పదమన్నారు. బీజేపీకి రైతు సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ పార్టీ కనుమ రుగు కాబోతుందన్నారు. రాష్ట్ర ఖజానాను కేసీఆర్ ఖాళీ చేశాడని దీంతో రాష్ట్రం పూర్తిగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

పంటలు ఎండిపోవడానికి కేసీఆరే పూర్తి బాధ్యుడని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. ధర్మపురి నియోజకవర్గ సమస్యలపై రాష్ట్ర మంత్రిగా వ్యవహరించిన ఈశ్వర్ ఏనాడైనా కేసీఆర్ దృష్టికి తీసుకవెళ్లాడా అని ప్రశ్నించారు. రైతులపై కపట ప్రేమ చూపించేందుకు గాను దొంగ దీక్ష చేపట్టడం సరైంది కాదన్నారు. రాజకీయంగా పేరు తెచ్చిన ఉమ్మడి కరీంనగర్‌కు కేసీఆర్ ఏమి చేయలేదన్నారు. ఈ సమావేశంలో టీసీపీపీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ సెక్రటరీ పుప్పాల అశోక్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య ఉన్నారు.

అక్షర చిట్‌ఫండ్స్‌పై మరో కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 1: చిట్ డబ్బులు ఇవ్వకుండా, వడ్డీ చెల్లిస్తామని డిపాజిట్ చేయించుకుని మోసం చేసినట్లు వచ్చిన ఫిర్యాదుతో కరీంనగర్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌పై కేసు నమోదు చేసినట్లు కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కొద్ది రోజుల క్రితం అక్షర చిట్‌ఫండ్స్ యాజమాన్యంపై కేసులు నమోదుకాగా, ఎండీ, డైరెక్టర్లను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం గాలిపల్లికి చెందిన మిట్టపల్లి భాగ్య అనే మహిళ 2019లో రాజీవ్‌చౌక్‌లోని అక్షర చిట్‌ఫండ్స్‌లో 5 లక్షల చిట్ వేసి, లిఫ్ట్ చేయగా ఆమెకు 3,87,418 రూపాయలు వచ్చాయి. ఆ డబ్బులను చెల్లించకుండా ఖతాదారుకు మాయమాటలు చెప్పి అక్షర టౌన్‌షిప్ సంస్థలో డిపాజిట్ చేస్తే 18 శాతం వడ్డీ ఇస్తామని 4 లక్షల రూపాయలు డిపాజిట్ చేయించకున్నారు. అప్పటి నుంచి ప్రతి నెల 6 వేల వడ్డీ 2023 సంవత్సరం నుంచి చెల్లించడం లేదు. అలాగే భాగ్య కూతురు, మరి కొందరు బంధువులను కూడా అక్షర చిట్‌ఫండ్స్ యజమాని, డైరెక్టర్లు ఇలాగే మోసం చేశారని బాధితురాలు సోమవారం కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అక్షర చిట్‌ఫండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ పేరాల శ్రీనివాసరావు, డైరెక్టర్లు శ్రీవిద్య, ఎస్ కొండల్‌రావు, పుప్పాల రాజేందర్, గోనె రమేష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎంపీటీసీపై అట్రాసిటీ కేసు

మల్యాల, ఏప్రిల్ 1: మండలంలోని బల్వంతాపూర్ ఎంపీటీసీ సంగని రవిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. మల్యాల ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపిన వివరాల ప్రకారం.. మార్చి 16న మండలంలోని మ్యాడంపల్లి శివారులో మల్యాల ఎంపీపీపై అవిశ్వాస సమావేశం గురించి చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేసుకు న్నారు. ఇందులో పలువురు ఎంపీటీసీలు పాల్గొనగా ఎంపీపీ అవిశ్వాస తీర్మానంపై మాట్లాడుకుంటుండగా ఎంపీటీసీ రవి నూకపల్లి ఎంపీటీసీ భర్త మారంపల్లి నారాయణను కులం పేరుతో దూషిస్తూ చంపుతానని బెదిరించాడు. ఆదివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. 2న ఎంపీపీ అవిశ్వాస సమావేశం ఉండగా ఎంపీటీసీపై కేసు నమోదు కావడం చర్చణీయాంశంగా మారింది

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 1: డ్రంకెన్‌డ్రైవ్ కేసులో నలుగురు వ్యక్తులకు జైలుశిక్ష పడిందని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 20మంది వాహనదారులను పోలీసులు సోమవారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా ఒకరికి 10 రోజులు జైలు శిక్ష మరొకరికి 7 రోజులు, ఇద్దరికి 3 రోజుల జైలుశిక్ష, ముగ్గురికి కలిపి 10 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మిగతా 16 మంది వాహనదారులకు 23 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 1: మండలంలోని రాజేశ్వర్‌రావుపేట గ్రామ శివారులోని వరద కాలువ బ్రిడ్జి వద్ద సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో కథలాపూర్ మండలంలోని పోతారం గ్రామానికి చెందిన వెలుమల దీక్ష(20) అనే యువతి అక్కడికక్కడే మృతి చెందినట్లు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దీక్ష నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి గ్రామంలో ఉన్న తన అక్క ఇంటికి వెళ్లింది. తన బావ కొత్తపల్లి దీలిప్‌తో కలిసి ద్విచక్రవాహనంపై పోతారం తిరిగి వస్తుండగా మండలంలోని రాజేశ్వర్‌రావుపేట వరద కాలువ బ్రిడ్జి వైపు వస్తున్న టిప్పర్ ఒక్కసారిగా జాతీయ రహదారిపైకి వేగంగా వచ్చి నిర్లక్ష్యంగా యూటర్న్ తీస్తుండగా బైక్‌ను ఢీకొట్టింది. దీంతో వెనుకాల కూర్చున్న దీక్ష టిప్పర్ టైర్ల కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. బావ దీలిప్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పెర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పిట్టల సంపత్

మానకొండూర్, ఏప్రిల్ 1: మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన పిట్టల సంపత్ (36) అనే రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్‌కు చెందిన సంపత్ గ్రామంలో రెండు ఎకరాల పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసుకుంటున్నాడు. రెండు రోజులుగా వ్యవసాయ బావి మోటార్ పనిచేయకపోవడంతో అదే గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘాతంతో పడిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మద్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య పిట్టల మమత ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- పరారీలో మరో నిందితుడు

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 1 : మహిళ హత్య కేసులో ఒక నిందితుడిని అరెస్ట్ చేయగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. బీహార్‌కు చెందిన ఇద్దరు 6 నెలల క్రితం కూలి కోసం సిరిసిల్లకు వచ్చారన్నారు. సిరిసిల్లలోని అశోక్‌నగర్‌లో గది అద్దెకు తీసుకొని పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. రుదల్ సదా, రామ్బిృక్ష్ సదా ఇద్దరు కూలి చేసే వద్ద వేములవాడ అర్బన్ మండలానికి చెందిన ఓ మహిళతో పరిచయం పెంచుకున్నారు. మార్చి 19న సాయంత్రం 6 గంటలకు కూలి పని అయిన తర్వాత ఆమెను రూమ్‌కి తీసుకెళ్లారు. మహిళ,ఇద్దరు కార్మికులు మద్యం తాగి అదే మత్తులో ఒకరు లైంగిక కోరిక తీర్చుకొని మరొకరు అనుభవించే క్రమంలో ఆమె మత్తు నుంచి తేరుకోవడంతో ప్రతిఘటించడంతో ఎవరికైనా విషయం చెపుతుందనే అనుమానంతో రూమ్‌లో ఉన్న సిలిండర్ బుడ్డితో ఆమె తలపై కొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బీహార్‌కు పారిపోయారని తెలిపారు. ఈ హత్యపై సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి డీఎస్పీ ఆధ్వర్యంలో సిరిసిల్ల టౌన్ సి.ఐ రఘుపతి, టాస్కోర్స్ సి.ఐ ప్రవీణ్‌కుమార్, ఎల్లారెడ్డిపేట్ ఎస్.ఐ రమాకాంత్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో స్పెషల్ టీం ఏర్పాటు చేసి, బీహార్ రాష్ట్రం ఖగారియా జిల్లా అనాపూర్ మారన్ గ్రామానికి చెందిన రామ్బిృక్ష్ సదా (37)ను అరెస్టు చేశామన్నారు. మరోనిందితుడైన రుదల్ సదా పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

సామాన్యుడికి న్యాయం అందేలా చూడాలి

జూనియర్ సివిల్ న్యాయాధికారి పావని



బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావుకు నియామక పత్రం అందిస్తున్న న్యాయాధికారి పావని

కోరుట్ల, ఏప్రిల్ 1 : సామాన్యుడికి సరైన న్యాయం అందేలా బార్ అసోసియేషన్ సభ్యులు చొరవ చూపాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి పావని అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం పట్టణంలోని కోర్టు ఆవరణలో జరుగగా న్యాయాధికారి పావని ముఖ్య అతిథిగా పాల్గొన్ని కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలను అందించారు. 2024-25 సంవత్సర బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా తన్నీర్ శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షుడుగా తోట ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా సుతారి శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా మద్దుల రోజ, మహిళ ప్రతినిధిగా చాప వందన, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కస్తూరి రమేష్, కొంపల్లి సురేష్, జూని యర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా సయ్యద్ అనాసొద్దిన్, ఉరిడి నరేందర్, దీప ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన బార్ అసోసియేషన్ సభ్యులను న్యాయాధికారి పావనితో పాటు ఎన్నికల అధికారులు మచ్చ రమణ మూర్తి, చెన్న విశ్వనాథం సన్మానించారు.

వ్యర్థాలను రోడ్డు పక్కన వేయొద్దు

మున్సిపల్ కమిషనర్ తిరుపతి

కోరుట్ల, ఏప్రిల్ 1 : వ్యాపారులు వ్యర్థాలను రోడ్డు పక్కన వేయొద్దని, పారిశుధ్య సమస్య తలెత్తకుండా పట్టణ ప్రజలు సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. పట్టణంలో రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ట్యాక్‌తో పాటు అయిలాపూర్, కల్లూర్ రోడ్డులో కొబ్బరి బొండా, చికెన్, జ్యూస్ సెంటర్ వ్యర్థాలు, పాత బట్టలను పడవేసిన వాటిని సానిటరీ ఇన్స్‌పెక్టర్ గజానంద్ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ తిరుపతి మాట్లాడారు. చిరు వ్యాపారులు వారి వద్దనున్న వ్యర్థాలను రోడ్డు పక్కన వేయొద్దన్నారు. ఎవరైన అలా చేస్తే 2019 మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం

మెట్‌పల్లి, ఏప్రిల్, 1 : ఇటీవల మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన వారికి సోమవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, నూతన పాలకవర్గం సభ్యులు శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా లింబాద్రి సీనియర్ న్యాయవాదుల సూచనలతో సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు అలుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, కోశాధికారి శెట్టి రాజు, సహాయ కార్యదర్శి జగన్, మగ్గిడి హరిభూషణ్, కోట రాజారెడ్డి పాల్గొన్నారు.

పంటలు ఎండిపోవడానికి బీఆర్ఎస్ నేతలే కారణం

కథలాపూర్, ఏప్రిల్ 01 : రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువ కింద పంటలు ఎండి పోవడానికి బీఆర్ఎస్ నేతలే కారణమని కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ గడ్డం స్వామిరెడ్డి, తుమ్మల చెరువు మాజీ చైర్మన్ వాకిటి రాజరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని భూషణరావుపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత భూషణరావుపేటలో ఎండిపోయిన పంటలకు కాంగ్రెస్ పార్టే కారణమని అవగాహన లేని వ్యాఖ్యలు చేశారన్నారు. పది సంవత్సరాలు రాళ్లవాగు కుడి కాలువను మరమ్మతులు చేయించక నీరంతా వాగులోకి వృథాగా పోతున్నా బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదన్నారు. వరద కాలువ నీటికి బీఆర్ఎస్ నాయకులు పరిశీలించిన పంటలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. సమస్యలపై అవగాహనాలేని జడ్పీ చైర్‌పర్సన్‌ను చూసి జిల్లా రైతులు అసహ్యించుకుంటున్నారన్నారు. ఈ సందర్భంగా గడ్డం చిన్నారెడ్డి, అశోక్, తలారి మోహన్, పురుకుటపు తిరుపతిరెడ్డి, భూమారెడ్డి, జలంధర్‌రెడ్డి ఉన్నారు.

చిల్వకోడూర్‌లో ఇఫ్తార్ విందు

గొల్లపల్లి, ఏప్రిల్ 1 : గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ గ్రామంలోని జామా మసీద్‌లో పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకుని ముస్లిమ్‌లు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయగా, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ పండగలు పరమత సహనానికి ప్రతీకలని పేర్కొన్నారు. ముస్లిమ్‌లకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిమ్‌లతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇఫ్తార్ విందు స్వీకించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి, ఎంపీటీసీ మహబూబ్, మాజీ సర్పంచ్‌లు గంగాధర్, సత్యానారాయణ గౌడ్, రాజ్యలక్ష్మీతిరుపతి రెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీధర్, వెంకటేష్ గౌడ్, నాయకులు మజ్జు, తిరుపతి, వేణు, చంద్రయ్య, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ముస్లిమ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా అడ్లూరి జన్మదిన వేడుకలు

- ●నరసింహుడి ఆలయంలో పూజలు
- ●కేక్ కట్ చేసి కార్యకర్తలు పంపిణీ

ధర్మపురి, ఏప్రిల్ 1: ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు ఆయనకు స్వామి వారి తీర్థ, ప్రసాదాలు అందించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్ష్మణ్‌కుమార్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. డీజే పాటల నడుమ ఆయనను గజ మాలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పేరట గల కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అనంతరం పలువురు పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ అడ్లూరిని కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఒక ఎలక్ట్రికల్ బైకును అడ్లూరికి గిఫ్ట్‌గా అందించారు. నేరెళ్ల సాంబశివుని ఆలయంలో లక్ష్మణ్‌కుమార్ పేరట పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, వెల్గటూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ రెడ్డవేని సత్యం, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.



ధర్మపురిలో కేక్ కట్ చేస్తున్న అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల టౌన్ : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో సోమవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కేక్ కట్ చేసి లక్ష్మణ్ కుమార్‌కు తినిపించి శుభాకాంక్షలు తెలియజేసి షాలువాతో సన్మానించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్ కుమార్‌కు పూల మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లో టీపీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ సెక్రటరీ అశోక్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, నాయకులు నందయ్య, జగదీశ్వర్, శ్రీనివాస్ ఉన్నారు.

పెగడపల్లి : వందేండ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీలో సోమవారం ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను తెలంగాణ స్టూడెంట్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కోలపురి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ బీఎస్ఎఫ్ అధ్యక్షుడు అంబేద్కర్, ఇందిరా గాంధీ నేషనల్ అవార్డు గ్రహీత తగరపు నవీన్, టీఎస్‌పి యూనివర్సిటీ నాయకుడు పాల్గొన్నారు.

● పెగడపల్లి మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. స్వయం భూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అన్న దానం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బుర్ర రాములు గౌడ్, జడ్పీటీసీ రాజేందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీని వాస్ పాల్గొన్నారు.



లక్ష్మణ్ కుమార్‌కు కేక్ తినిపిస్తున్న జీవన్ రెడ్డి

మల్లాపూర్: ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ జన్మదిన వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరిపారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, ఆనంద్‌గౌడ్, మల్లయ్య, రమేష్ పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని చిల్వాకోడూర్, శ్రీరాముల పల్లె తదితర గ్రామాల్లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జన్మదినం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. చిల్వాకోడూర్‌లో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీ సందర్శించి ఏమైనా సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలన్నారు. కాగా, కాంగ్రెస్ నాయకులు కిష్టంపాట రమేష్ రెడ్డి లక్ష్మణ్ కుమార్ జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నిశాంత్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు సత్యానారాయణ గౌడ్, గంగాధర్, రాజ్యలక్ష్మీతిరుపతి రెడ్డి, వెంకటేష్ గౌడ్, శ్రీధర్ పాల్గొన్నారు.

నవోదయలో సీటు సాధించిన విద్యార్థులు

రాయికల్, ఏప్రిల్ 1: రాయికల్ పట్టణానికి చెందిన వాసాల అక్షర, ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న గుండ సాహితిలు జవహర్ నవోదయలో 6వ తరగతి సీటు సాధించారు. ఇటీవల నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలో అక్షర ప్రతిభ కనబరిచి సీటు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఎంపీటీసీ కొమ్ముల రాధఆదిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు ఏలేటి జలందర్‌రెడ్డి, నాయకులు కొక్కు శేఖర్, గణేష్‌లు అభినందించారు.

ఇంటి పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ

రాయికల్, ఏప్రిల్ 1: రాయికల్ మున్సిపల్‌లో గృహ వినియోగదారులు ఏప్రిల్ 1 నుంచి 30లోపు ఇంటి పన్ను చెల్లించినట్లయితే 5 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర ప్రభుత్వం ఈ వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, ఏప్రిల్ 1 : మండల కేంద్రంలో నిర్మిస్తున్న గుండ్రప్ప శివాలయం పునర్నిర్మాణానికి సోమవారం దూడ తిరుపతి పుష్పలత దంపతులు పెళ్లి రోజు సందర్భంగా 10,116 రూపాయలను, మొగిలి హన్మయ్యలక్ష్మి దంపతులు 5వేల 16 రూపాయలను విరాళంగా ఆలయ కమిటీ వారికి అందించారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సైకిల్‌పై వెళ్లి బాలరాముని దర్శనం

రాయికల్, ఏప్రిల్ 1: మండలంలోని రామారావుపల్లె గ్రామానికి చెందిన మారుతి గురు స్వామి మార్చి 16న అయోధ్య బాలరాముని దర్శనం కోసం సైకిల్‌పై బయలుదేరాడు. దర్శనం చేసుకుని తిరిగి గ్రామానికి చేరుకున్న మారుతి స్వామిని ఇటిక్యాలకు చెందిన గురుస్వామి సామల్ల వేణు ఆధ్వర్యంలో స్వాములు ఘనంగా సన్మానించారు. కిషోర్, వంశీ, హరికృష్ణ, బ్రహ్మయ్య, శివ, రంజిత్, రాజు, మాల్యాద్రి, మహేష్ పాల్గొన్నారు.

కట్టమైసమ్మ పండగ నిర్వహణ కమిటీ

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 1: ఎల్లారెడ్డిపేట మండలానికి ప్రధాన సాగు నీటి వనరైన సింగసముద్రం చెరువు కట్టమైసమ్మ పండగ నిర్వహణ కమిటీ ప్రతినిధులను సోమవారం మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఎన్నుకున్నారు. ప్రతినిధులుగా ఒగ్గు బాలరాజుయాదవ్, నద్ది లక్ష్మారెడ్డి ఎన్నికయ్యారు. సభ్యులుగా రాంరెడ్డి, బాల్‌రెడ్డి, రాజయ్య, ఎల్లయ్య, మల్లయ్య, తిరుపతిరెడ్డి, విఠల్‌రెడ్డి, బాలయ్య, నర్సయ్య, పోచయ్య, గోపాల్‌రెడ్డి, వెంకటరెడ్డి వ్యవహరించనున్నారు. ఈ నెల 7న నిర్వహించనున్న కట్టమైసమ్మ పండగ ఖర్చుల నిమిత్తం ఆయకట్టు రైతులు ఎకరాకు రూ.200 చెల్లించాలని నిర్ణయించారు. రైతుల వద్ద అధికంగా వసూలు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నా రు. ఈ నెల 3న స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ధరలను నిర్ణయించేందుకు సమావేశం ఏర్పాటు చేయనున్నామని రైతులు పేర్కొన్నారు.

సంఘ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి

వంజర సంఘ రాష్ట్ర డైరెక్టర్ బొమ్మల శంకర్



చెక్కును అందిస్తున్న రాష్ట్ర నాయకుడు శంకర్

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 1: సంఘ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తున్నట్లు వంజర సంఘ రాష్ట్ర డైరెక్టర్ బొమ్మల శంకర్ అన్నారు. సోమవారం మండ లంలోని సంగెం గ్రామ వంజర సంఘ అభివృద్ధి రాష్ట్ర సంఘ ఆధ్వర్యంలో మంజూరు చేసిన రూ. లక్ష చెక్కును స్థానిక సంఘ సభ్యులకు అందించారు. ప్రతి గ్రామంలో వంజరి సంఘాల అభివృద్ధి కోసం రాష్ట్ర న్యాయకత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులను స్థానిక నాయకులు శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు నల్ల వెంకటేశ్వర్ల్ వంజరి సంఘ సభ్యులు తుక్కారం, వేణుగోపాల్, లక్ష్మినారాయణ, సుధాకర్, రాజుకుమార్, రవి, చిన్నయ్య పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం పాల్గొని పూజలు చేస్తున్న మహిళలు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 1 : మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని సీతా రామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా జరిపించారు. సోమవారం ఉదయం నుంచి ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు, పూజలు పురోహితులు చక్రపాణి మాధవ చార్యుల నేతృత్వంలో ఆలయ అర్చకులు తులసి వెంకటేశ్‌చార్యులు జరిపారు. అనంతరం నిర్వాహకులచే హోమం, ధ్వజారోహణ, గరుడ లగ్నం, బలిహరణ, పూర్ణహుతి, కుంభాషేకం ప్రత్యేక పూజలు తదితర కార్యాక్రమాలను పురోహితులు జరిపించారు. భక్తుడు పుస్తె, మట్టెలు అందించగా సీతారాముల వారి కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తీలకించారు.

అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సొంత గూటికి చెరుకున్న యూసుఫ్‌నగర్ బీఆర్ఎస్ నేతలు



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 1 : మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేతలు సోమవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సమక్షంలో తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన అచ్చ చంద్రశేఖర్, లింగంపల్లి ప్రణీత్ కుమార్, కళవత్రి కళ్యాణ్, కుంట శేఖర్, పల్లి లక్ష్మణ్, చిట్యాల నగేష్, ఆర్మూర్ లక్ష్మణ్, న్యావనంది సురేష్‌లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. తిరిగి సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సమక్షంలో ఎంపీపీ తోట నారాయణ, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు. వారికి పార్టీ కండవా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే అహ్వానించారు.

ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించాలి

మెట్‌పల్లి, ఏప్రిల్, 1: లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు రాజకీయ పార్టీలు 33 శాతం సీట్లు కేటాయించాలని మెట్‌పల్లి సీనియర్ న్యాయవాది తెడ్డు సురక్ష అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడుతుండగా రాజకీయ రంగంలో పార్టీలు వెనుకకు నెడుతున్నాయన్నారు. బీసీల రిజర్వేషన్‌ల కోసం 2023లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు ప్రకారం కులగణన జరగాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు కనీసం 33 శాతం మహిళలకు సీట్లు కేటాయించాలని కోరారు.

ముందస్తు జాగ్రత్తలతో అధిక దిగుబడులు

మెట్‌పల్లి రూరల్, ఏప్రిల్, 1: రైతులు సాగు చేస్తున్న పంటలపై ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని చెర్లకొండపూర్‌లోని రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. పలువురు రైతులకు చెందిన నువ్వు పంటలకు వేరుకుల్లు తెగుళ్ల ఆశించినట్లు గుర్తించి సూచనలు చేశారు. వాతావరణ మార్పులతో పంటలకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉన్నందున రైతులు ఎప్పటికప్పుడు పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరికలు

కథలాపూర్, ఏప్రిల్ 1: మండల బీజేవైఎం అధ్యక్షుడు తోకల ప్రవీణ్, బీఆర్ఎస్ నాయకుడు పానుగంటి రాజు, తాండ్ర్యాల మాజీ ఉపసర్పంచ్ బద్దం మహిపాల్‌రెడ్డి, దేశవేని ధర్మేందర్ వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, రాష్ట్ర ఫిషర్‌మెన్ విభాగం కార్యదర్శి కల్లెడ గంగాధర్, ఉరుమల్ల చారి ఉన్నారు.

అర్హులైన వారికి రేషన్ దుకాణం అప్పగించాలి

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 1 : మండలంలోని పైడిమడుగు గ్రామలోని ఎస్సీ కాలనీలో నిర్వహిస్తున్న రేషన్ దుకాణం అర్హులైన వారికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గ్రామ యువకులు పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు మాట్లాడుతూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి రేషన్ దుకాణం అప్పగించి గ్రామస్థులను ఇబ్బందుల పాలు చేయవద్దని అధికారులను కోరారు. కార్యక్రమంలో గ్రామ యువకులు ప్రదీప్, లంక ధర్మయ్య, దుంపాల నితిన్, ప్రమోదు, జగన్, మణిదీప్, వినయ్, లోకేష్, రాకేష్, రామకృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, ఏప్రిల్ 1: మండల కేంద్రానికి చెందిన వొడ్నాల ధర్మయ్య, మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన కొలకాని అక్షయ్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను సోమవారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు స్వామి, తిర్మలేష్, నర్సింగ్, రాకేష్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ధర్మపురి, ఏప్రిల్ 1: రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ జిల్లా మేనేజర్ వేంకటేశ్వర్‌రావు కోరారు. ధర్మపురి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ధాన్యం ఏ గ్రేడ్ రకం ధర రూ 2,203, సాధరణ రకం ధర రూ 2,183 ఉన్నట్లు ఆయన వివరించారు. ఈ కార్య క్రమంలో ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి భూమన్న, డీసీఎంఎస్ ఉద్యోగి నర్సయ్య, మార్కెట్ సిబ్బంది, హమాలీలు పాల్గొన్నారు.

పెగడపల్లి: కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర పొందాలని సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివ నాగేందర్ రెడ్డి, పెగడపల్లి సెర్ప్ ఏపీఎం సమత పేర్కొన్నారు. సోమవారం పెగడపల్లి, నందగిరి సింగిల్‌విండోల ఆధ్వర్యంలో పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలను శివనాగేందర్ రెడ్డి, మహిళా సంఘాల ఆధ్వర్యంలో మద్దులపల్లి, అయిత్‌పల్లి, రాంబద్రునిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఏపీఎం సమత ప్రారంభించారు. కేంద్రాలలో రైతులకు అన్ని వసతులు కల్పిస్తూ కొనుగోలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమాలలో సీఈవోలు తడ్కమడ్ల గోపాల్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, సీసీ శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల: సెర్ప్ ఆధ్వర్యంలో మండలంలోని ముత్యంపేట, తాటిపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జీసీ రాజయ్య, మండల సమాఖ్య అధ్యక్షురాలు బోనాల అంజలి, సీసీలు కృష్ణమోహన్, గంగరాజం, గంగ, లత, సుధ, సమలత, నర్మద, గంగాదేవి, రజని, గంగమోహన్, సరిత, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు

మెట్‌పల్లి రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధానాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం కల్పిస్తున్న మద్ధతు ధరను పొందాలని సివిల్ సప్లై ఉమాపతి అన్నారు. సోమవారం మండలంలోని జగ్గసాగర్, మెట్లచిట్టాపూర్, ఏఎస్ఆర్ తండా, సత్తక్కపల్లి గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీపీఎమ్ వనజతో కలిసి ప్రారంభించారు. కేంద్రాల వద్ద రైతులు, హమాలీల కోసం తాగునీరు, నీడ సౌకర్యం తదితర వసతులను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సెర్ప్ సీసీలు వెంకటరమణ, అశోక్, శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఏఈవో భూమేశ్వర్, వీవో రేఖ, మహిళ కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: మండలంలోని మాదాపూర్, పైడిమడుగు, మోహన్‌రావుపేట, వెంకటాపూర్, ధర్మారం, అయిలాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రత్యేక అధికారులు, ఐకేపీ నిర్వహకులు రైతులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎం శంకర్, మండల వ్య వసాయ అధికారిణి నాగమణి, సీసీలు సురేందర్, శాంత, లావణ్య, సంతోష్, వివోలు సుజాత, లత, అనురాధ, లావణ్య, సింధూజ, హరిష్ మహిళ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల సింగిల్‌విండో అధ్వర్యంలో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అయిదు కొనుగోలు కేంద్రాలను జిల్లా మార్కెటింగ్ అధికారి చంద్ర ప్రకాష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి వరలక్ష్మి, దత్తత అధికారి అశోక్, సీఈవో మిట్టపెల్లి గోవర్ధన్, ఏఎంసీ సూపర్‌వైజర్ శ్రీదేవి, సిబ్బంది సురేష్, శ్రీనివాస్, రాజశేఖర్ రైతులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో 10 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వనజ ప్రారంభించారు. సిరికొండ, తక్కళ్ళపల్లి, దూలూరు, భూషణరావుపేట, కథలాపూర్, పోతారం, తాండ్ర్యాల, పెగ్గెర్ల, చింతకుంట, అంబారిపేట గ్రామాల్లో కేంద్రాలను ఎంపీడీఓ శంకర్‌తో కలిసి ప్రారంభం చేశారు. కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడకు టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమాల్లో ఏపీఎం నరహరి, సీసీలు తెడ్డు అంజయ్య, విజయలక్ష్మి, అశోక్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మండలం వెంగళాపూర్, వెన్గుమట్ల, బొంకూర్ గ్రామాల్లో సోమవారం యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో ఏపీఎం త్రివేణి ప్రారంభించారు. ఈ సందర్భంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వరంగ సంస్థలకే తమ ధాన్యంను విక్రయించి మద్దతు ధరను పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సీసీ దొనకొండ మల్లేశం, సీఏ బెక్కం గాయత్రి, రైతులు పాల్గొన్నారు.

మల్లాపూర్: సెర్ప్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని సాతారం, చిట్టాపూర్, మొగిలిపేటలతో పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం దేవరాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీలు లక్ష్మి రాజం, గ్రామసమాఖ్య సంఘాలు, మహిళలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం మండల కేంద్రంతో పాటుగా మండలంలోని చెప్యాల, అప్పారావుపేట, తిప్పాయిపల్లి, చింతల్లపల్లి, రాంసాగర్, హిమ్మతురావుపేట, సూరం పేట, గంగారాంతండా గ్రామాలలో సెర్ప్ సీసీలు ప్రారంభించారు. ఈ కార్య క్రమాలలో సీసీలు వీరకుమార్, మంగ, స్వరూప, వీవోఏలు, కమిటీ సభ్యులు, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.



ధర్మపురిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా మేనేజర్



జగ్గసాగర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సివిల్‌సప్లై డీటీ ఉమాపతి



మల్యాలలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న డీఎంవో